బాక్స్ డ్రైనేజీ పనులు వెంటనే పూర్తి చేయాలి



కొత్తపేటలో రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలను తీయించి వేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో నిలిపివేసిన బాక్స్ డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులను కోరారు. డివిజన్ పరిధిలోని గాయత్రి పురం కాలనీ, నాగేశ్వర్ రావు కాలనీ, ఎస్ ఆర్ఎల్ కాలనీ, సత్యనగర్ కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్డుపై బాక్స్ డ్రైనేజీ పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో రోడ్డుపై ఎక్కడికక్కడ మట్టి కుప్పలు ఉండటంతో జనం రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలిసి కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ ఆయా కాలనీల్లో గురువారం పర్యటించారు. సంబంధిత ఏఈతో నిలిచిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అనంతరం టిప్పర్‌తో రోడ్డుపై ఉన్న మట్టికుప్పలను తీయించివేశారు. బాక్స్ టైప్ డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయిన చోట కొత్తగా సీసీ రోడ్డు వేయిస్తామని కాలనీవాసులకు ఆయన హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట కాలనీ అధ్యక్షుడు రాంనాథ్ రెడ్డి, నాయకులు సుందర్ నారాయణ, అశ్విన్ సింగ్, కొత్త తిరుమల, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహామృత్యుంజయ హోమం



పూర్ణాహుతితో ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న మధుసూదన్ రెడ్డి

హస్తినాపురం: కర్మన్‌ఘాట్ డిఫెన్స్‌కాలనీలోని హరిహరక్షేత్ర అయ్యప్పస్వామి ఆలయం 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో 2వ రోజైన గురువారం బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామశరన్ శర్మ గురూజీ పర్యవేక్షణలో శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీరమాలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మృత్యుంజయ పాశుపత హోమం, హారతి తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పూజల్లో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ వంగా మధుసూదన్‌రెడ్డి దంపతులు, ఆలయ ప్రధాన కార్యదర్శి గడ్డం మంగారెడ్డి, ఆలయ కమిటీ డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

పోషణ పక్వాడపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆయుర్వేద వైద్యులు

నాగోలు: ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ గడ్డి అన్నారం సంస్థ ఆధ్వర్యంలో కొత్తపేట మోహన్‌నగర్‌లోని రాధా ఇనిస్టిట్యూట్ ఫర్ మెంటల్లీ రిటార్డెడ్‌లో గురువారం పోషణ పక్వాడ, ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులు (సీజనల్, రీజనల్) పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రీసెర్చ్ ఆఫీసర్, ఆయుర్వేద డాక్టర్ సంతోష్ మానే, అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి డాక్టర్ జీపీ ప్రసాద్‌లు ఋతువులు, ప్రాంతాలు కనుగుణంగా ఎటువంటి పౌష్టికాహారం తీసుకోవాలనేది విద్యార్థులకు వివరించారు. పౌష్టికాహారానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం సంస్థలో తయారు చేసిన జొన్న లడ్డూలు, అరటి పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శ్రీనివాసరావు ఉపాధ్యాయరాలు పి.రాజేశ్వరి పాల్గొన్నారు.

పోషకాహార ప్రాధాన్యతను వివరించాలి



మహిళకు పోషకాహారం, పండ్లు అందజేస్తున్న సీడీపీఓ జ్యోత్స్న

సైదాబాద్: ఆరోగ్యకరమైన జీవనానికి పోషకాహారం , పండ్ల రసాలు సేవించడం తప్పనిసరి అని చార్మినార్ ప్రాజెక్ట్ సీడీపీఓ జ్యోత్స్న అన్నారు. గురువారం సైదాబాద్ సెక్టార్‌లో పోషణ పక్షం వేడుకలు నిర్వహించారు. పలువురు అంగన్‌వాడీ టీచర్లు పోషకాహారాల నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ జ్యోత్స్న మహిళలకు పోషకాహారం , పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ టీచర్లు తమ ప్రాంతాల్లోని మహిళలకు పోషకాహార ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ సరూర్‌నగర్ కన్వీనర్‌గా శ్రీవాణి



హుడాకాంప్లెక్స్: బీజేపీ సరూర్‌నగర్ డివిజన్ కన్వీనర్‌గా స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణికి ప్రచార బాధ్యతలు అప్పగించారు. కో కన్వీనర్‌లుగా జైన్‌బాబు, బెంగరబోయిన సురేష్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీవాణి మాట్లాడుతూ.. లోక్ సభ ఎన్నికల్లో సరూర్‌నగర్ డివిజన్‌లో బీజేపీకి 15వేల ఓట్లకు పైగా మెజారిటీ వచ్చేవిధంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ముందుకుపోతామన్నారు. తమ నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



కాంగ్రెస్ నాయకులతో రఘుమారెడ్డి

- మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి
- ఘట్టుపల్లిలో ముఖ్య నేతలతో సమావేశం

మహేశ్వరం: చేవెళ్ల గడ్డపైన కాంగ్రెస్ జెండాను ఎగురవేసి తీరుతామని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఘట్టుపల్లిలో గురువారం కాంగ్రెస్ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. బీఆర్‌ఎస్ మునిగిపోయే పడవలాంటిదని.. త్వరలో ఆ పార్టీ ఖాళీ అవుతుందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ ఓట్లు సాధించే విధంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకులు రాకేష్‌రెడ్డి, ఘట్టుపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సాబేర్, సీనియర్ నాయకులు.. మల్లప్ప, అంజయ్య, ఎర్ర యాదగిరి, సంజీవ, మహ్మద్, గోవర్ధన్, కుమార్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, రాజు, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

నాగోలు: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా, మునుగాల గ్రామానికి చెందిన పాలపాటి రాధయ్య(80) సాగర్ రింగ్ వద్ద ఉండే కుమారుడి వద్దకు కొంత కాలం క్రితం వచ్చాడు. గురువారం సాయంత్రం ఎల్‌బీనగర్ చౌరస్తాలో రాధయ్య రోడ్డు దాటుతుండగా.. ఉప్పల్ డిపోకు చెందిన బస్సును డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. రాధయ్య కుమారుడు శ్యామ్ సుందర్ ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు బస్సు డ్రైవర్ నరేష్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

ఎక్కడ చూసినా మట్టికుప్పలే!

- కొత్తపేటలో నత్తనడకన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు
- ఇళ్ల ముందు పెద్ద పెద్ద గుంతలు
- పనులు పూర్తైనా మట్టి పూడ్చని వైనం
- రాకపోకలకు జనం అవస్థలు



కొత్తపేట గ్రామంలో డ్రైనేజీ కోసం రోడ్డును తవ్వి వదిలేసి దృశ్యం



డ్రైనేజీ పనులు పూర్తైనా తొలగించకుండా వదిలేసిన మట్టి



మరమ్మతుకు నోచుకోని రోడ్డు

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని పలు కాలనీల్లో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతుండటంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల డ్రైనేజీ పైప్‌లైన్ కోసం తవ్వకాలు చేపట్టిన అధికారులు పనులు పూర్తైనా కూడా గుంతల్ని పూడ్చకుండా వదిలేస్తున్నారు. ఇళ్ల ముందు పెద్ద పెద్ద గుంతలు ఉండటంతో కాలనీలోనే ఒకచోట నుంచి మరోచోటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

- కొత్తపేట గ్రామంతో పాటు డివిజన్ పరిధిలోని భరత్ నగర్, మోహన్ నగర్, స్నేహపురి కాలనీ, న్యూ నాగోల్ కాలనీలో ఎక్కడా చూసినా మట్టి కుప్పలే దర్శనమిస్తున్నాయి
- పనులు మొదలైనప్పుడు డ్రైనేజీ సమస్య పరిష్కారం అవుతోందని సంతోషించామని, అయితే, నెలలు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో కొత్త సమస్యలు ఎదుర్కొంటున్నామని కొత్తపేట గ్రామస్తులతో పాటు ఆయా కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఇదిగో.. అదిగో అంటూ కాంట్రాక్టర్లు కాలయాపన చేయడం తప్ప నిర్మాణ పనుల్ని పూర్తి చేయడం లేదని వారు వాపోతున్నారు.
- ఇప్పటికైనా జలమండలి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కొత్తపేట గ్రామంతో పాటు వివిధ కాలనీల్లో జరుగుతున్న డ్రైనేజీ పనులు సత్వరం పూర్తయ్యేలా చర్యలు తీసుకొని తమకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

మలక్‌పేటలో 85 ఏళ్లు పైబడ్డ ఓటర్లు 3849



మలక్‌పేట డీసీ జయంత్

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గంలో 85 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లు 3849 మంది ఉన్నారని నియోజకవర్గం ఈఆర్‌ఓ జయంత్ తెలిపారు. గురువారం మలక్‌పేటలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 315952 కాగా, అందులో మహిళా ఓటర్లు 156630, పురుష ఓటర్లు 159307 ఉన్నారన్నారు. దివ్యాంగ ఓటర్లు 1067, ట్రాన్స్‌జెండర్లు 15 మంది ఉన్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హోమ్ ఓటింగ్‌లో పాల్గొన్న వారి జాబితా సిద్ధం చేశామని తెలిపారు. 85 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్ల కోసం ప్రత్యేక ఫారాలు సిద్ధం చేసి వాటిని ఓటర్లకు అందించే ప్రక్రియ మొదలు పెట్టామన్నారు. అభ్యర్థుల నామినేషన్, ఉపసంహరణ తర్వాత మూడు, నాలుగు రోజుల్లో హోమ్ ఓటింగ్ ఉంటుందని ఈఆర్‌ఓ జయంత్ తెలిపారు.

సీఎంను కలిసిన లింగోజిగూడ బీఆర్‌ఎస్ నాయకులు



లింగోజిగూడ: డివిజన్ కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కోటగిరి శ్రీనివాస్ గౌడ్ గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంను కలిసిన వారిలో కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం మాజీ డైరెక్టర్ చెగోని అశోక్ గౌడ్ తదితరులు ఉన్నారు పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

టైల్స్ వర్కర్ అదృశ్యం



శ్రీనివాస్

మలక్‌పేట: యువకుడు అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జయంత్ తెలిపిన వివరాల ప్రకారం..జె.నర్సింహ భార్య, ఇద్దరు సోదరులతో కలిసి మూసారంబాగ్ డివిజన్‌లోని శాలివాహన నగర్‌లో పదేళ్లుగా నివాసం ఉంటున్నాడు. ఇతని తమ్ముడు జె.శ్రీనివాస్(25) టైల్స్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 18న టైల్స్ వర్క్ మెషీన్‌ను తీసుకోకుండా బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధు,మిత్రులను వాకబు చేసినా శ్రీనివాస్ ఆచూకీ దొరకలేదు.దీంతో సోదరుడు నర్సింహ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదింటి పెళ్లికూతుళ్లకు ఉప్పల ఫౌండేషన్ చేయూత

నాగోలు: నిరు పేదలకు ఉప్పల ఫౌండేషన్ నిరంతరం చేయూత నిందిస్తోందని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, టూరిజం పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగోలులోని తన నివాసంలో గురువారం ఆయన సికింద్రాబాద్‌కు చెందిన రుచికా, నల్లొండకు చెందిన మల్లేశ్వరి, బండ్లగూడకు చెందిన శ్రావణి, జనగాంకు చెందిన మౌనికలకు వారి వివాహం సందర్భంగా మంగళసూత్రం, మెట్టెలు, చీర, గాజులు విరాళంగా అందజేశారు. కోటగిరి చంద్రశేఖర్, సునీత, యాదయ్య, స్వరూప, మల్లేష్, వెంకటేష్, చంద్రశేఖర్ గుప్తా, శంకర్ గుప్తా పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు పాటుపడే వారికి గుర్తింపు



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను సన్మానిస్తున్న దాస్

సైదాబాద్: పార్టీ పటిష్టతకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కాంగ్రెస్‌లో తప్పక గుర్తింపు లభిస్తుందని ఐఎస్‌సదన్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నగరిగారి దాస్ అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన టీపీసీసీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు ఎన్.ప్రీతంను ఆయన నివాసంలో గురువారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాస్ ఆధ్వర్యంలో ఐఎస్‌సదన్ డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.శాలువా, పూలబొకేతో ఆయన సత్కరించారు. ఐఎస్‌సదన్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు కె.వెంకటమ్మ, నేనావత్ దేవి, అంజమ్మ, అనిల్, సరోజ, లక్ష్మి, ఆలివేలు, కృష్ణవేణి, ఇందిరా, దయానంద్, నరేష్ పాల్గొన్నారు.

బంజారా కాలనీలోని సమస్యలు పరిష్కరిస్తా



బంజారా కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

హయత్‌నగర్: డివిజన్‌లోని బంజారా కాలనీలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కాలనీలో పర్యటించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. కాలనీలోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయని ఆయన అన్నారు. అధికారులతో మాట్లాడి డ్రైనేజీ సమస్యను పరిష్కరింపజేస్తామని, అవసరమైన చోట కొత్త పైప్‌లు వేయిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలూనాయక్, శంకర్‌నాయక్, భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా కో ఇన్‌చార్జిగా శ్రీనివాస్



చంపాపేట: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ ఓబీసీ మోర్చా కో ఇన్‌చార్జిగా చంపాపేటకు చెందిన రాంపురం శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేసి చంపాపేటలో జరిగిన సమావేశంలో అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... బాధ్యతాయుతమైన పదవిలో తనను నియమించిన ఆనంద్‌గౌడ్, పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్తల సహకారంతో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రతీ బూత్ స్థాయినుంచి బీజేపీని మరింత బలోపేతం చేసి పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానన్నారు.

కార్లతో విద్యార్థుల హంగామా

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- కౌన్సెలింగ్ ఇచ్చిన ఏసీపీ కేపీవీ రాజు



బీటెక్ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం: వారంతా బీటెక్ విద్యార్థులు.. తాము చేసేదే కరెక్ట్ అనుకునే స్వభావం కలిగిన వయసు వాళ్లది. కళాశాలలో జరిగే ఫేర్‌వెల్ పార్టీకి కార్లతో ర్యాలీగా వెళ్లారు. ఈ క్రమంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించారు. గమనించిన పోలీసులు విద్యార్థులను అడ్డగించారు. వారిలో మార్పు తీసుకొచ్చేందుకు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. మంగళ్‌పల్లి, పోచారం గ్రామాల మధ్యనున్న సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫేర్‌వెల్ పార్టీకి 20 కార్లతో ర్యాలీగా సుమారు వంద మంది విద్యార్థులు రోడ్లపైకి వచ్చారు. హైదరాబాద్, నాగార్జునసాగర్ ప్రధాన రహదారిలోని కొంగర క్రాస్ రోడ్డు వద్ద ఇష్టానుసారంగా వాహనాలను నడుపుతూ, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన విద్యార్థులకు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మారయ్యలు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. లైసెన్స్‌లు, అనుమతి లేకుండా ర్యాలీలు తీయడం, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి పొరపాట్లు మళ్లీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

బఫర్ జోన్‌లో నిర్మాణాలు

పట్టించుకోని అధికారులు



మంఖాల్ వాగు బఫర్ జోన్‌లో నిర్మిస్తున్న గోడ

తుక్కుగూడ: అక్రమార్కులు బఫర్‌జోన్‌లను సైతం వదలడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామంలో సర్వే నంబర్ 376లో బఫర్‌జోన్‌లో రియల్టర్లు యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు. మంఖాల్ వాగు నుంచి వరద నీరు బాగ్ మంఖాల్ చెరువు, తుక్కుగూడ గ్రామాల మీదుగా రావిర్యాల చెరువులోకి వెళ్తుంది. వాగులో నీరు నిర్మాణాలకు అడ్డు రాకూడదని రియల్టర్లు భారీ ఎత్తున గోడను నిర్మిస్తున్నారు. 100 ఫీట్ల వెడల్పుతో ఉన్న వాగు బఫర్ జోన్‌లో రిటైనింగ్ వాల్‌ను నిర్మించి నీటిని అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు. వాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టి నిర్మాణాలకు సదరు రియల్టర్లు ఉపయోగిస్తున్నారు. వాగులో అక్రమ కట్టడాలు నిలిపివేయాలని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బఫర్ జోన్ నిర్మిస్తున్న కట్టడాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై శంషాబాద్ డివిజన్ ఇరిగేషన్ ఏఈ గోవింద్ స్పందిస్తూ.. మంఖాల్ వాగులో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్‌ను పరిశీలిస్తామన్నారు. అనుమతులు లేకుండా బఫర్ జోన్‌లో నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మర్యాదపూర్వక కలయిక



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ తదితరులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అనంతరం ఆమె ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మధుయాష్కీగౌడ్, మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, వజీర్ ప్రకాశ్‌గౌడ్, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, వేములయ్యగౌడ్ పాల్గొన్నారు.

సీఎంకు 'ముత్తినేని' కృతజ్ఞతలు



ముఖ్యమంత్రిని కలిసిన ముత్తినేని వీరయ్య

చాదర్‌ఘాట్: వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనను చైర్మన్‌గా నియమించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు. అనంతరం వీరయ్య మాట్లాడుతూ, పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి కోరిక మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వికలాంగులు, పెరిక కులస్తులు అందరూ కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతగా ఉంటారని అన్నారు.

'కాసానిని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం'

దిల్‌సుఖ్‌నగర్: చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం అని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద శర్మ అన్నారు. ఈనెల 24న మీర్‌పేట ఎస్‌వైఆర్ గార్డెన్స్ లో నిర్వహించే సన్నాహక సమావేశం నేపథ్యంలో గురువారం ఆయన గ్రీన్‌హిల్స్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆర్‌కేపురం డివిజన్ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించిన వారు పార్టీ మారడం బాధాకరమన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నాయకులు రామాచారి, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వెంకటేష్ గౌడ్, కంచర్ల శేఖర్, బుజ్జి బాయి, కల్పన, హేమ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి దక్షిణ భారత న్యాయవాదుల క్రికెట్ టోర్నీ

రంగారెడ్డి కోర్టులు: హయత్‌నగర్ మండలం కుంట్లూరులోని ఓ ప్రైవేట్ మైదానంలో ఈనెల 23 నుంచి 25 వరకు ఐదవ దక్షిణ భారత న్యాయవాదుల క్రికెట్ టోర్నీ జరగనుంది. ఈ టోర్నీలో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల జట్టుకు రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాది పోచారం రాఘవేందర్ రెడ్డి నాయకత్వం వహించనున్నారు. ఈ టోర్నీలో దక్షిణ భారత దేశంలో వివిధ రాష్ట్రాల జట్లు పాల్గొంటాయని ఆయన తెలిపారు.

ఆర్టీసీ డిపోలో మజ్జిగ కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న డీఎం హరి

చైతన్యపురి: వేసవిని దృష్టిలో పెట్టుకొని డిపోలో పనిచేసే సిబ్బంది కోసం ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించామని దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపో మేనేజర్ హరి తెలిపారు. వేసవి తాపాన్ని తట్టుకొనేందుకు తాగునీటితో పాటు మజ్జిగ అందజేస్తామన్నారు. వేసవిలో డైవర్లు, కండక్టర్లు, మెకానిక్ సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ ఎన్.వెంకన్న, సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థికి నక్క ఫౌండేషన్ చేయూత

వనస్థలిపురం: పేద విద్యార్థుల ఉన్నత చదువునకు తమ సంస్థ ద్వారా చేయూత అందిస్తున్నామని నక్క వెంకటమ్మ యాదవ్, నక్క యాదగిరి స్వామి యాదవ్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ నక్క శ్రీనివాస్ యాదవ్ అన్నారు. నల్లగొండ జిల్లా కేతెపల్లి మండలం ఉప్పల పహాడ్ గ్రామానికి చెందిన ఇరుగు పవన్ కల్యాణ్ చదువులో రాణిస్తూ ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చదువుతున్నాడు. అతడికి అవసరమైన పుస్తకాలు, ఇతర మెటీరియల్స్‌ను నక్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు.

'ఓజోన్'కు బెస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అవార్డు'



అవార్డు అందుకుంటున్న ఓజోన్ హాస్పిటల్స్ ఎండీ దీప్తి సాయి ప్రసాద్

దిల్‌సుఖ్‌నగర్: నగరంలోని హెచ్ఐసీసీ సమీపంలో గల నోవాటెల్ హోటల్ లో గురువారం 'రేడియో సిటీ' నిర్వహించిన 'హైదరాబాద్ ఐకాన్ అవార్డ్స్' కార్యక్రమంలో బెస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్' కేటగిరీలో నగరంలోని ఓజోన్ హాస్పిటల్స్ అవార్డును గెలుచుకుంది. జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి చేతుల మీదుగా ఓజోన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ దీప్తి సాయి ప్రసాద్ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో ఓజోన్ హాస్పిటల్స్ చైర్మన్ జీవీ సత్యసాయి ప్రసాద్, చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, డైరెక్టర్ వై.మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.